సాక్షి అనకాపల్లి

శనివారం । 22 । జూన్ । 2024



ఘనంగా వారాంతపు పూజలు

విశాఖ: రుషికొండలో శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలు ఘనంగా నిర్వహించారు.



ఘనంగా క్షీరాభిషేక సేవ

విశాఖ: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.0/28.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపు

మహారాణిపేట (విశాఖ): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపునకు రంగం సిద్ధమైంది. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులను ఈ నెల 30వ తేదీ నుంచి నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు 29 మంది స్పెషలిస్ట్ వైద్యులకు నోటీసులు జారీ చేశారు. జులై ఒకటో తేదీ నుంచి ఈ వైద్యుల జీతాల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్.గణపతి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాలో 29 మంది వైద్యులు, అనకాపల్లి జిల్లాలో ఐదుగురు వైద్యులను తొలగించనున్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



పోలీస్ గ్రీవెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: అవకాశం ఉన్నంత మేరకు దిగువ స్థాయి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 15 మంది సిబ్బంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టాపర్‌కు విట్‌లో ఉచిత విద్య



విద్యార్థిని రేవతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పలరాజు, అధ్యాపకులు

రోలుగుంట: ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివి జిల్లా టాపర్‌గా నిలిచిన పేదింటి బిడ్డ ఎం.రేవతికి కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్య అవకాశం లభించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.రేవతి ఇటీవల ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో 971/1000 మార్కులు సాధించి అనకాపల్లి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈమె ప్రతిభను గుర్తించిన అమరావతి లోని వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా ఉచితంగా ఇంజనీరింగు సీటు మంజూరు చేసింది. తమ కళాశాలకు జిల్లాలోనే గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థిని రేవతిని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.అప్పలరాజు, సీనియర్ గణిత అధ్యాపకుడు సహదేవుడు, అధ్యాపకులు అభినందించారు.

పశు వైద్యాలయాల్ని సందర్శించిన డీడీ



పశు సంవర్ధక శాఖ డీడీ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న రైతులు

మునగపాక: పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖరరావు శుక్రవారం మునగపాక పశు వైద్యాలయాన్ని సందర్శించారు. రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు డీడీ చంద్రశేఖరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం చంద్రశేఖరరావు మాట్లాడుతూ పాడి పశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి పాల సార కలిగిన పశువులను కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సేవల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్, రైతు సంఘ ఉపాధ్యక్షుడు దాడి శివ, కాండ్రేగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

లాహిరి.. లాహిరిలో..





నౌకా విహారం చేస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

డాబాగార్డెన్స్ (విశాఖ): నిత్యం పాల కడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. సాగరానికి చేరువలోని శృంగమణి శిఖరం.. ఆ రమణీయ దృశ్యాన్ని చూసి తరించింది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజన కోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం సాయంత్రం తెప్పోత్సవం నయన మనోహరంగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన హోమాలు, బలిహరణం, తీర్థగోష్ఠి చేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులను ముందుగా పల్లకిలో మెట్లమార్గం మీదుగా కిందకు తీసుకొచ్చారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు స్వామివారి పల్లకిని మేళతాళాలు, అర్చక స్వాముల వేదమంత్రాల నడుమ తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక వరకూ మోసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన నౌకపై అధిష్ఠింపజేశారు. భక్తులు ప్రయాణించే లాంచీలు అనుసరించగా.. స్వామి కాసేపు తెప్పపై సాగర విహారం చేశారు.

● యోగాభ్యాసం



అనకాపల్లి మండలం మామిడిపాలెం హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

శారీరక ఆరోగ్యం.. మానసిక వికాసం.. ప్రశాంత జీవనం.. ఒక్క యోగాతోనే సాధ్యం. యోగా ప్రకృతిని, మనిషిని సంలీనం చేస్తుంది. సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుంది. యోగా ఒక ఆసనం మాత్రమే కాదు.. శాస్త్రీయమైన ప్రక్రియ. యోగా సాధన ప్రకృతితో అనుసంధానం చేస్తూ.. మనల్ని మనం తెలుసుకునేలా చేస్తుంది. యోగా ఆరోగ్యవంతులను చేయడమే కాదు.. మన జీవన విధానంలో గొప్ప మార్పు తెస్తుంది. ప్రతి ఒక్కరూ ఇప్పుడు యోగ సాధన చేస్తున్నారు. అందుకే శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పండగలా చేసుకున్నారు. విద్యార్థులు, అధికారులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు.

8లో



యోగా చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

మరింతమందికి బంగారు ‘భవిత’



చీడికాడ మండలంలో అడ్మిషన్లు కల్పిస్తున్న సిబ్బంది

- ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే పూర్తి
- అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే 2,483 మంది దివ్యాంగ బాలలు
- కొత్తగా 516 మంది చిన్నారుల గుర్తింపు
- వారందరికీ సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు
- భవిత కేంద్రాల్లో ఉద్యాన వనాల ఏర్పాటు
- చిన్నారులకు ఆటపాటలతో చదువులు



కశింకోట మండలంలో గుర్తించిన పిల్లలకు పాఠశాలలో ప్రవేశం కల్పిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌కు ‘భవిత’ కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయి. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలతో భవిత కేంద్రాలు బలోపేతమయ్యాయి. ఈ నేపథ్యంలోనే చాలా కాలం తరువాత సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో ప్రత్యేక అవసరాల పిల్లలు మరికొంతమంది వెలుగులోకి వచ్చారు. జిల్లాలోని పదకొండు మండలాల్లో ఇప్పటికే 2,483 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా, తాజాగా చేసిన సర్వేలో 516 మందిని గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

ప్రతి ఒక్కరి లెక్క పక్కా

ప్రత్యేక అవసరాల పిల్లలు వాస్తవంగా ఎంతమంది ఉన్నారనే వాస్తవ లెక్క తెలియని పరిస్థితి గతంలో ఉండేది. కానీ తాజాగా సచివాలయం యూనిట్‌గా సమగ్ర సర్వే చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన 2,483 మందితోపాటు, కొత్తగా గుర్తించిన 516 మంది ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు. ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తూ, ఆయా పాఠశాలల యు-డైస్ కోడ్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు, వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంది.

భవిత కేంద్రాల్లో ఉద్యానవనాలు

జిల్లాలో 24 భవిత కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలకు 493 మంది వస్తున్నారు. 240మంది ఇళ్ల వద్దనే సేవలు పొందుతున్నారు. కాస్త మెరుగ్గా ఉన్న మిగతా వారు సమీపంలోని పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లలు కావటంతో వీరికి ఆటపాటలతో చదువులు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను భవిత కేంద్రాలకు సమకూరుస్తున్నారు. పిల్లల మనోవికాసానికి దోహదపడేలా ప్రశాంత వాతావరణంలో చదువులు సాగించాలనే లక్ష్యంతో కేంద్రాల ప్రాంగణంలో ఉద్యాన వనాలు ఏర్పాటు చేస్తున్నారు. రకరకాల ఔషధ గుణాలు, పూల మొక్కలను పెంచేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

ఇంటి వద్దనే ఫిజియోథెరపీ

ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్లు (ఐఈఆర్పీలు) అందుబాటులో ఉన్నారు. వీరితోపాటు ప్రతి కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. ఆ విధంగా జిల్లాలో 48 ఐఈఆర్పీలు, 24మంది ఆయాలు సేవలు అందిస్తున్నారు. శారీరక వైకల్యం ఉన్న వారు ఎక్కువగా ఉన్నందున, వీరికి ఇంటి వద్దనే అవసరమైన వైద్య సేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం ఫిజియోథెరపిస్టులు విద్యార్థుల ఇళ్లను సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో కొత్తగా 516 మంది నమోదయ్యారు. దీనిపై సమగ్ర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులందరికీ ఆటపాటలతో చదువులు చెప్పేలా కేంద్రాలను పర్యవేక్షిస్తున్నాం.

– బి.శకుంతల, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్



పరవాడ మండలంలోని భవిత కేంద్రం

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం (విశాఖ): విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో 11 గురుకులాల్లో (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం) నాలుగు బాలురు, ఏడు బాలికలు పాఠశాలలకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి 6,7,8,9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి రూపవతి తెలిపారు. ఈ మేరకు కంచరపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దరఖాస్తుతో ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం జత చేసి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు సమర్పించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని ఆమె కోరారు. మిగిలిన వివరాలకు జిల్లా హెల్ప్ లైన్ నంబర్ 0891-2799641కు సంప్రదించాలన్నాలని తెలిపారు.

18,800 భూసార పరీక్ష కార్డులు మంజూరు

తుమ్మపాల: జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీకి సంబంధించి 18,800 మట్టి నమూనాలు పరీక్షించి భూసార పరీక్ష కార్డులు మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతుల కమతాల నుంచి కనీసం 40 చొప్పున మట్టి నమూనాలు సేకరించామన్నారు. మట్టి నమూనా యాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా జీపీఎస్ ఉపయోగించి సేకరించామన్నా రు. భూసార కేంద్రంలో మట్టి పరీక్షల అనంతరం ఆర్‌బీకేల ద్వారా రైతులకు భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు.

బాలల బడి బాట



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఇతర విద్యా శాఖాధికారులు

- అదే మన లక్ష్యం కావాలి
- సర్వేలో గుర్తించిన పిల్లల్ని తక్షణం బడిలో చేర్చండి
- సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి

చోడవరం రూరల్: బాలలందరూ చదువుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నేను బడికి పోతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించిన అనంతరం ఆమె కమిటీ సభ్యులతో పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సమీక్ష నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తిస్తే వారిని వెంటనే పాఠశాలలో చేర్పించాలని, వారిని పనుల్లో చేర్చడం, చేర్చుకోవడం నేరమన్న సంగతిని ఇటు తల్లిదండ్రులకు, అటు ఆయా యాజమాన్యాలకు తెలియపరచాలని చెప్పారు. గుర్తించిన పిల్లలను వెంటనే బడిలో చేర్చే పనిని బాధ్యతగా నెరవేర్చాలన్నారు. పట్టణ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలో ఐదుగురు పిల్లలను బడిలో చేర్చలేదని సర్వే ద్వారా తెలుసుకున్న కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి.. మండల విద్యాశాఖాధికారులు సింహాచలం, జయలక్ష్మిలతో కలిసి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారికి తమ పిల్లల చదువు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించిన మీదట వారు అంగీకరించడంతో లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

స్టార్ట్ కెమెరా.. యాక్షన్

సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా సుందరకోట, తాండవ

8లో


షూటింగ్‌లో సీనియర్ కెమెరామెన్ యువరాజ్


తాండవ గట్టుపై సినీ హీరో ఆదర్శబాలకృష్ణ, డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్


సినిమాలో నటించే చిన్నారుల సందడి

స్టార్ట్ కెమెరా.. యాక్షన్

- సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా సుందరకోట, తాండవ
- తక్కువ ఖర్చుతో అద్భుతమైన సన్నివేశాల చిత్రీకరణకు నెలవు
- ఏజెన్సీని తలపించేలా మైదాన ప్రాంతంలో ప్రకృతి అందాలు

దట్టమైన అడవుల్లా కనిపించాలి. ప్రకృతి రమణీయతను అణువణువునా సంతరించుకున్న కొండలు, కోనలు, జలపాతాలకు నెలవు కావాలి. సినిమా చిత్రీకరణకు అనువుగా ఉండాలి. అందుకే ఏజెన్సీని తలపించేలా దర్శనమిచ్చే మైదాన ప్రాంతమైన సుందరకోట కొండలు, తాండవ రిజర్వాయర్ అందాలు సినీ దర్శకుల మనసుల్ని కొల్లగొడుతున్నాయి. వరుస షూటింగ్‌లతో సందడి చేస్తున్నాయి.


తాండవ జలాశయంలో సినిమా సన్నివేశాల చిత్రీకరణ

నాతవరం: మండలంలోని సరుగుడు సుందరకోట ప్రాంతంతో పాటు తాండవ రిజర్వాయర్, దాని పరిసరాలు సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారుతున్నాయి. ఈ రెండు ప్రదేశాల్లో ఇటీవల కాలంలో ఐదు సినిమాలకు సంబంధించిన పలు కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. మరింత మంది దర్శకులు, కెమెరామెన్లు, కళాదర్శకులు ఈ ప్రాంతాల్లో పర్యటించి, తమ చిత్రాలకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న జలపాతాలు, ఘాట్‌రోడ్లు

పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంతో పాటు చూడ చక్కని ప్రదేశాలు అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో ఉన్నాయి. సరుగుడు సుందరకోటలో ఏజెన్సీకి దీటుగా జలపాతాలు, ఘాట్ రోడ్లు ఉండటంతో అందరి చూపు ఇటువైపు మళ్లింది. దీనికితోడు జిల్లాలోని మేజర్ సాగునీటి ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్‌పై సైతం సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండు కొండల నడుమ చూడముచ్చటగా నిర్మించిన తాండవ ప్రాజెక్టు కనుచూపు మేర కనిపించే రమణీయత కట్టిపడేస్తుంది. ఇటీవల తాండవ ప్రాజెక్టు లోట్టు ప్రాంతంలో నుంచి నాతవరం, గొలుగొండ మండలాలను అనుసంధానిస్తూ నిర్మించిన తారు రోడ్డు సినిమా, షార్ట్ ఫిలిం షూటింగ్‌లకు నెలవుగా మారింది.


సుందరకోట కొండపై షూటింగ్ సందడి

ఇప్పుడిప్పుడే సినీ పరిశ్రమ దృష్టికి..

గతంలో అడవులు, కొండలు, జలపాతాల మధ్య షూటింగ్ చేయాలంటే పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. మైదాన ప్రాంతమైన సుందరకోట సమీపంలో ఏజెన్సీకి దీటుగా కొండలు, అడవి అందాలతో తక్కువ ఖర్చుతో సినిమా సన్నివేశాలు చిత్రీకరణ పూర్తవుతోందని సినీ ప్రముఖులు చెప్పున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతాలపై పెద్దగా అవగాహన లేకపోవడంతో చాలా డబ్బు, సమయం వృధా చేసుకునేవాళ్లమని, ఇక మీదట ఆ సమస్య ఉండదంటున్నారు. ఇటీవల అనుభవించు రాజా సినిమా డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్, స్థానిక సినీనటుడు ఎల్.జోగినాయుడు ఈ ప్రాంతాల్లో పర్యటించి హైదరాబాద్‌లోని సినీ పరిశ్రమ ప్రముఖుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏడాదిలోనే ఈ ప్రాంతంలో పలు సినిమా షూటింగ్‌లు నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని ఒకసారి చూసిన సినిమా డైరెక్టర్లు కొత్తగా తాము తీసే సినిమాల్లో పలు సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

షూటింగ్‌లకు అనువైన ప్రదేశం



తక్కువ ఖర్చుతో అధిక సన్నివేశాలు చిత్రీకరించేందుకు చక్కట ప్రదేశాలు తాండవ రిజర్వాయర్, సరుగుడు సుందరకోట ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాంతంపై అవగాహన లేక ఇలాంటి సన్నివేశాల చిత్రీకరణ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాం. మారేడుమిల్లి, రంపచోడవరం, సప్పర్ల, సీలేరు, అరుకు ప్రాంతాల్లో ఉండే సుందర ప్రదేశాలు నాతవరం మండలంలోనే ఉన్నాయి. తాండవ సరుగుడు ప్రాంతాల్లో రెండు సినిమాల సన్నివేశాలు చిత్రీకరించాం. ఈ ప్రాంతంలో 25 రోజులకు పైగా చాలా సన్నివేశాల కోసం షూటింగ్ చేశాం.

– శ్రీనివాస్ గవిరెడ్డి, అనుభవించు రాజా సినిమా డైరెక్టర్

పెద్ద సినిమా వాళ్లు అడుగుతున్నారు



సుందరకోట తాండవ ప్రదేశాల్లో సినిమా షూటింగ్‌లకు పెద్ద పెద్ద డైరెక్టర్లు అడుగుతున్నారు. గత ఏడాది నా హయాంలో మూడు సినిమాల షూటింగ్‌లు జరిగాయి. చాలా మంది సినిమా ఆరిస్టులు ఈ ప్రాంతంలో షూటింగ్‌లకు వచ్చి లొకేషన్లు బాగున్నాయని అంటున్నారు. గతంలో ఇలాంటి అందమైన ప్రాంతాల కోసం ఇతర దేశాలకు వెళ్లేవారిమని చెప్తున్నారు. తాండవలో రాజేంద్ర ప్రసాద్, అదర్శ బాలకృష్ణ, బెనర్జీ, తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, అల్లరి నరేష్, జోగిబ్రదర్స్‌తో పాటు పలువురి సినిమాలు షూటింగ్‌లు జరిగాయి.

– షేక్, లోకల్ మేనేజర్, రజాక్ సినిమా షూటింగ్

ప్రమాదంలో యువకుడి మృతి

- నేవల్ బేస్ వద్ద బంధువుల ఆందోళనకు యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో హరిపాలెం రోడ్డుపై ధర్నా
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు


హరిపాలెం రహదారిపై ధర్నా చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం రహదారిపై శుక్రవారం రాత్రి విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనికి సంబంధించిన వివరాలివి. రాంబిల్లి నేవల్ బేస్ పరిసరాల్లోని నిషిద్ధ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని మునగపాక మండలం పాటిపల్లిబీసీ కాలనీకి చెందిన సీలింగ్ పనులు చేసే యువకుడు కొయిలాడ మారుతి(23) తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. గాయపడ్డ యువకుడ్ని ఎవ్వరూ పట్టించుకోలేదు. తీరా చికిత్స నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు నేవల్ బేస్‌లో ఓ కాంట్రాక్టర్ వద్ద శుక్రవారం పనికి వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురైనట్లు బంధువులు చెప్పున్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని నేవల్ బేస్ గేట్ వద్ద ఉంచి ఆందోళన చేయాలని మృతుని బంధువులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హరిపాలెం వద్ద మృత దేహంతో ఉన్న వాహనాన్ని నిలిపేయడంతో కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అచ్యుతాపురం సెజ్‌కు వెళ్లే వాహనాలను పోలీసులు వేరే మార్గంలో మళ్లించారు. బంధువుల్ని అచ్యుతాపురం స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతుడి తండ్రి అప్పలరాజు ఫార్మాసిటీలో సెక్యూరిటీ గార్డు. తల్లి లక్ష్మి గృహిణి. వీరికి ఇద్దరు కొడుకులు. మారుతి రెండోవాడు. ఏడాది కిందట పెద్ద అబ్బాయికి ప్రమాదం జరిగి మంచానికే పరిమితమయ్యాడు. ఆ కుటుంబం మారుతి సంపాదనపైనే చాలా వరకు ఆధారపడి ఉంది. ఆయన మరణంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక రేపు

అచ్యుతాపురం: జూలై 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈ నెల 23న అచ్యుతాపురంలోని వెదురువాడ ఆక్సిజన్ రిసార్ట్స్‌లో ఎంపిక చేయనున్నట్లు సిమ్మింగ్ జిల్లా సంఘం కార్యదర్శి సీహెచ్ దేముడు తెలిపారు. 10 నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన వారిని మూడు కేటగిరీల్లో ఈ స్విమ్మింగ్ పోటీల జట్లకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9573690954 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

'ప్రిన్సిపాల్‌పై నిర్భయ కేసు పెట్టాలి'

నర్సీపట్నం: వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు డీఎంకే కళాశాల వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు భూషణ్ మాట్లాడుతూ విద్యార్థిని పట్ల ప్రిన్సిపాల్ శౌరి అసభ్యకరంగా ప్రవర్తించటం దురదృష్టకరమన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జ్ఞానేష్, జనార్దన్, మను, దుర్గ, మోహన్ పాల్గొన్నారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్ శౌరిపై నిర్భయ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేధింపులకు నిలయంగా మారిన డీఎంకే కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు.


గొలగాంలో ఎన్ఆర్‌జీఎస్ కార్మికులతో యోగాసనాలు వేయిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరి


వడ్డాదిలో విద్యార్థుల యోగా విన్యాసాలు


గాంధీనగరం హైస్కూల్లో యోగా చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ


అనకాపల్లి కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయమూర్తి రమేష్, న్యాయవాదులు

యోగాభ్యాసంతో అద్భుత ఫలితాలు

అనకాపల్లి: యోగ సాధనతో శరీరకంగా, మానసికంగా ఉల్లాసాన్ని పొందవచ్చని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ భీశెట్టి అప్పారావు కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఆయుష్‌మాన్‌భారత్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా విశిష్టతను, ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి రోజూ యోగాను అభ్యసించాలని హితవు పలికారు. నేటి పరిస్థితులలో యోగాకు మరింత ప్రాధాన్యమిస్తూ రోజువారీ దినచర్యగా పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. యోగా ద్వారా ఎన్నో మంచి ఫలితాలు ఉన్నాయని, మనుషులకు శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. పాశ్చాత్య పోకడల ప్రభావం నుంచి సమాజం బయట పడాలంటే యోగా ఒక్కటే సరైన మార్గమని, దాన్ని అందరూ అనుసరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం జిల్లా వైద్యురాలు కె.లావణ్య, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, అడిషినల్ ఎస్పీ విజయ్‌భాస్కర్, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వైద్యులు బినయ్‌కుమార్, ఎం.రామలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, చంద్రవదన, యోగా శిక్షకులు బి.అప్పారావు, ఎం.చంద్రిక, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కళాకారుల్ని తీర్చదిద్దడమే కళ్యాణి అకాడమీ లక్ష్యం

తుమ్మపాల: కళల పట్ల అభిరుచి ఉన్నవాళ్లకి అవగాహన కల్పించి, రాబోయే తరాలకు మంచి కళాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఉడ్‌పేటలో ఉన్న అకాడమీలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగీత పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి, ఇంకా బాగా చదువుకుంటారని పేర్కొన్నారు. 2002 జూన్ 21న ప్రపంచ సంగీత దినోత్సవాన దివంగత ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలు సూచనలతో పట్టణంలో దీన్ని ప్రారంభించామన్నారు. 22 ఏళ్లుగా అకాడమీని విజయవంతంగా నడిపేందుకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుకు, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, కడ్మిసెట్టి అచ్యుత రామయ్యలకు ఋణపడి ఉంటామన్నారు. ఇప్పటివరకు 3 వేలకు పైన విద్యార్థులకు శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు అకాడమీ విద్యార్థులు ఆలపించిన గీతాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్, అకాడమీ ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ధర్నాలో విద్యార్థి సంఘాల నాయకులు



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

అనకాపల్లి: దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో తక్షణమే విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్రకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి చెందిన వారు కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. తక్షణమే ఎన్టీఏ వెల్లడించిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను రద్దు చేసి, నీట్ పరీక్షల్ని రీ-కండక్ట్ చేయాలన్నారు. ఇటీవలే విడుదలైన నెట్ పరీక్ష ఫలితాల్లో పేపర్ లీకేజీ జరిగిందని గుర్తించిన కేంద్రం, వెంటనే దాన్ని రద్దు చేసిందన్నారు. నీట్ పరీక్షలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.30-40 లక్షలు వసూలు చేసినట్లు తెలిసినా పరీక్షను రద్దు చేయకుండా మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల్లో విద్యార్థులకు మైనస్ మార్కులు కూడా ఉండడం జరుగుతుందని, శత శాతం(720) మార్కులు వచ్చిన 67 మందిలో ఇంటర్ ఫెయిలైన వారు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్తున్నా, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది ప్రతిభగల విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారని ఆక్షేపించారు. వైద్య విద్యను వ్యాపారంగా మార్చి, నీట్ పేపర్ లీకేజీకి పాల్పడ్డ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీట్ పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ జరిపించి, పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, తాతాజీ, రాకేష్, సంపత్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు

సం'క్షేమ' హాస్టల్

కశింకోటలోని వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ వసతి గృహం(బీసీ హాస్టల్).. పేరులోనే కాదు, ఆరు మాసాల క్రితం వరకు తీరులో కూడా చాలా వెనుకబాటే. పెచ్చులూడుతున్న శ్లాబ్. మట్టి రోడ్లను పోలి ఉండే ఫ్లోర్. విరిగిన తలుపులు, కన్నాల కిటికీలు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఊసే లేని పరిస్థితి. తాజా మాజీ ఎంపీ బీవీ సత్యవతి, చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ చొరవతో ఇప్పుడు హాస్టల్ రూపురేఖలే మారిపోయాయి.


పునరుద్ధరణ తరువాత బాలుర హాస్టల్ గది

- మాజీ ఎంపీ సత్యవతి చొరవ, చెట్టినాడ్ సిమెంట్స్ సాయం
- బీసీ బాలుర వసతి గృహంలో సౌకర్యాల కల్పన
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు


కశింకోటలో రంగులు వేసి అందంగా ముస్తాబు చేసిన బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం

కశింకోట: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో సుమారు 100 మంది విద్యార్థులు వసతి పొందుతూ, సమీపంలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకుంటున్నారు. మొన్నటి వరకు వేరే గత్యంతరం లేని వాళ్లు మాత్రమే చాలా వరకు ఇక్కడ ఉండేవారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ఈ హాస్టల్లో చేర్పించాలంటే కాస్త ఆలోచించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తాజా మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి హాస్టల్ మరమ్మతులు, వసతుల కల్పనకు చొరవ చూపారు. ఎంపీ నిధులతోపాటు, చెట్టినాడ్ సిమెంట్ యాజమాన్యంతో మాట్లాడి అదనపు నిధులు ఏర్పాటు చేశారు.

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

వసతి గృహం చాలా కాలంగా కనీస మరమ్మతులకైనా నోచుకోలేదు. తలుపులు, కిటికీలు దెబ్బతిని పెద్ద కన్నాలు పడి దారుణంగా ఉండేది. చలికాలంలో గదుల్లోకి శీతల గాలులు, వర్షాకాలంలో నీటి తుంపర్లు వచ్చి విద్యార్థులు నానా ఇబ్బందులు పడేవారు. ఫ్యాన్లు ఉన్నా.. సరిగా తిరిగేవి కావు. మరుగుదొడ్లు, స్నానాల గదులు పూర్తిగా మరుగున పడిపోయాయి. దీంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న గత ఎంపీ సత్యవతి స్పందించి ఆరు మాసాల క్రితం రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీంతో 4 సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. మండలంలోని ఏఎస్ పేట వద్దనున్న చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం కూడా ముందుకు వచ్చి వసతి గృహంలో సదుపాయాల మెరుగుకు రూ.15 లక్షలు సమకూర్చింది. దీంతో వేసవి సెలవుల్లో మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టారు. రంగులేసి ముస్తాబు చేశారు.

వసతులు మెరుగయ్యాయి

దెబ్బతిన్న తలుపులు, కిటికీల రెక్కలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. గదుల్లో ఫ్యాన్లు బిగించి, విద్యుత్ సదుపాయాన్ని మెరుగుపర్చారు. వర్షం వస్తే కారిపోయే వంట గదికి మరమ్మతులు చేపట్టారు. వాటర్ ట్యాంకు, పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి సదుపాయాన్ని మెరుగుపర్చారు. విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వసతి గృహ ప్రాంగణంలో దిమ్మెను పునరుద్ధరించారు.

దానికి తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలి. వసతి గృహం చుట్టూ భద్రత కోసం రక్షణ గోడను నిర్మించాల్సి ఉంది. వీటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. వేసవి సెలవులు ముగించుకుని హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు మారిన హాస్టల్ రూపురేఖలు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా హాస్టల్లో చేరేందుకు వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మేం ఉన్నపుడు అధ్వానం



ఈ హాస్టల్లో ఉంటూనే తాజాగా టెన్త్ పాసయ్యాను. మేం ఉన్నపుడు హాస్టల్లో సరైన సదుపాయాల్లేక, చాలా అధ్వానంగా ఉండేది. ఫ్యాన్లు సరిగా తిరిగేవి కాదు. తలుపులు, కిటికీల రెక్కలకు కన్నాలు పడి చలికాలంలో చాలా ఇబ్బంది పడేవాళ్లం. టాయిలెట్లు లేక బయటకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు టాయిలెట్లు కట్టారు. హాస్టల్‌కు రిపేర్లు చేసి, రంగులేశారు. చాలా బాగుంది.

–నడిపల్లి నవీన్, తాజా పూర్వ విద్యార్థి, రావికమతం

సంతోషంగా ఉంది



రెండేళ్ల నుంచి ఇక్కడే హాస్టల్లో ఉంటూ, దగ్గర్లోని డీపీఎన్ హైస్కూల్లో చదువుకుంటున్నా. ఇప్పుడు 8వ తరగతిలోకి వచ్చా. హాస్టల్‌కు రిపేర్లు చేసి, మంచిగా రంగులేశారు. గతంలో పెచ్చులూడుతూ భయంకరంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అవసరమైన వసతులు కూడా కల్పించారు. ప్రహరీ, ఇంకా మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తే భయం లేకుండా ధైర్యంగా ఉండొచ్చు.

–నగిశెట్టి నారాయుడు, విద్యార్థి

నెలాఖరులోగా పనులు పూర్తి

గత ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, స్థానిక సిమెంట్ పరిశ్రమ చొరవతో బాలుర వసతి గృహం రూపురేఖలు మారాయి. రూ.25 లక్షలతో వసతి గృహ మరమ్మతు, అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అందంగా రంగులు వేసి, ముస్తాబు చేశాం. రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాం. ప్రహరీ నిర్మాణం, ఇతర చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– పీలా నారాయణరావు, వసతి గృహ సంక్షేమ అధికారి

క్లుప్తంగా

మూడో విడత చందన సమర్పణ నేడు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కొబ్బరితోటలోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి మూడో విడత చందన సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామ చంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5 గంటలకు చందన సమర్పణ, అనంతరం లక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి, అమ్మవారికి దీపాలంకరణ, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరపనున్నట్లు వెల్లడించారు.

వేడుకగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో బాలకృష్ణ దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో కొలువైన గౌరీపరమేశ్వరులకు శుక్రవారం 193వ ఊంజల్ సేవ ఘనంగా జరిగింది. దేవాలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి, వేద పండితులచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊంజల్ సేవలో వ్యాపారవేత్త పెంటకోట బాలకృష్ణ–శకుంతల, సంతోష్–రామలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిణి వ్యవస్థాపకులు పెంతకం శెట్టి సుజాత, ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , సభ్యులు ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా


పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: స్థానికపంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. తమకు బకాయిపడ్డ ఐదు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.రాంజీ, కార్యదర్శి జి.వెంకటరమణ, కోశాధికారి కె.దేముడు, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్ షాప్ మూర్తి	:సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	: శ్రీసత్య
హరోం హర	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 62 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,950	4,960
రెండో రకం	4,000	4,560
మూడోరకం	3,300	3,880

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు వాణిజగదీశ్వరి

అనకాపల్లి: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.వాణిజగదీశ్వరి తెలిపారు. మండలంలోని గొలగాం పంచాయతీ కేటీడీపాలెంలో సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్రరక్త కణాల రుగ్మతల సమూహమన్నారు. మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉండటంతో ఈ వ్యాధి లక్షణమన్నారు. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ తీసుకెళ్తుందని, ఆక్సిజన్ లేకపోవతే శరీరంలో ఏ భాగంలోనైనా కణజాలం, అవయవ నష్టానికి దారితీస్తుందన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్లలో నొప్పులు, శ్వాస తీసుకోవడంలో అనేక రకాలైన ఇబ్బందులు కలుగుతాయన్నారు. సత్వర చికిత్సతో దీన్ని నియంత్రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మరియమ్మ, సునీత, సంతోషి, బి.సంఘం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి

అనకాపల్లి: పౌరసరఫరాల శాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికు(హమాలీ)ల రేట్లు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పౌర సరఫరాల శాఖ హమాలీల యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 268 పాయింట్లలో సుమారు 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా తెల్ల రేషన్ కార్డు కుటుంబాలకు బియ్యం, ఇతర సరకుల సరఫరాలో హమాలీలే కీలకమని పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకు రేట్లు పెంచుతూ ఒప్పందం చేయాల్సి ఉండగా, 2023 డిసెంబర్‌తో ముగిసిన ఒప్పందాన్ని కొత్త కూలి రేట్లతో పునరుద్ధరించాలన్నారు. కొత్త ప్రభుత్వం హమాలీల బాధలను అర్థం చేసుకుని, వారి సమస్యల్ని తీర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి శతజయంతి ఉత్సవాలు


కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి ఆలయంలో గోపూజ, ఆలయ మండపంలో బాల త్రిపుర సుందరిదేవికి ప్రత్యేక పూజలు, అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు వంటి పూజా కార్యక్రమాలను రేజేటి రామణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ మండపంలో అమ్మవారికి శాంతి హోమం, ప్రవచనాలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ పుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు


హోమం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

సమగ్ర బాలికల వసతి గృహంలో ప్రవేశాలు


వసతి గృహంలో ప్రవేశాలు కల్పిస్తున్న వసతి గృహం సంక్షేమ అధికారి నిర్మల


వసతి గృహంలో చేరేందుకు తల్లిదండ్రులతో వచ్చిన బాలికలు

కశింకోట: స్థానిక సమగ్ర బాలికల వసతి గృహంలో ప్రవేశాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వసతి గృహం సంక్షేమ అధికారి నిర్మల సమక్షంలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాలు, ప్రధానంగా చింతపల్లి, పాడేరు తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి బాలికలు వసతి గృహంలో చేరుతున్నారు. సమీపంలో బాలికల హైస్కూల్ ఉండటం, వసతి గృహంలో సదుపాయాలు మెరుగ్గా ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు. వసతి గృహంలో 400 సీట్లు ఉన్నాయి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలు ఇక్కడ ఉంటూ, చదువుకుంటున్నారు. వీటిలో 80 సీట్లు ఖాళీగా ఉండటంతో వాటికి ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కొత్తగా 20 మంది చేరారని, వచ్చే నెలాఖరు వరకు ప్రవేశాలకు సమయం ఉన్నట్లు సంక్షేమ అధికారి నిర్మల తెలిపారు.

సంగీతంతో మానసిక ఉల్లాసం


అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తోలేటి బుచ్చిరాజు

అనకాపల్లి: సంగీతంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, నేటి యువత సంగీతంపై అవగాహన పెంచుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శారదానది ఒడ్డున ఉన్న అన్నమాచార్య విగ్రహానికి ప్రముఖ వీణా విద్వాంసుడు తోలేటి బుచ్చిరాజుతో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1982 నుంచి ప్రపంచ వ్యాప్తంగా సంగీత దినోత్సవాన్ని ఏటా జూన్ 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలియుగ దైవం వెంకన్న భక్తుడు, తెలుగులో వేల కీర్తనలను రచించిన తాళ్లపాక అన్నమాచార్యుల్ని స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, డేగల రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

శారదానదిలో జారిపడి వ్యక్తి మృతి


మారేడుపూడి రాము మృతదేహం

అనకాపల్లి: స్థానిక శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన మారేడుపూడి రాము(33) శుక్రవారం రాత్రి శారదానదిలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఫిర్యాదు అందిందన్నారు. మృతుని భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మన కోసం.. మన సమాజం కోసం.. యోగా

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలకు మెరుగైన మార్గం యోగా. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు. శ్వాస వ్యాయామాలతో మనలో ఉన్న ఒత్తిడిని, ఆందోళనల్ని పారద్రోలి, నిరాశ, నిస్పృహలకు లోనవకుండా చేస్తుందని యోగా గురువుల మాట. అందుకే ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'మన కోసం, మన సమాజం కోసం యోగా' థీమ్‌తో శుక్రవారం ఊరూవాడా, చిన్నా పెద్దా తేడా లేకుండా యోగా, ధ్యానం, ప్రాణాయామం చేశారు.


కశింకోట బాలికల హైస్కూల్లో యోగా సాధన చేస్తున్న విద్యార్థినులు


గాంధీనగరం హైస్కూల్లో యోగా డే అక్షరాల ఆకృతిలో విద్యార్థుల విన్యాసం

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- ఊరూవాడా, పిల్లలు, పెద్దలు యోగాసనాలు

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాభ్యసన కార్యక్రమాలు, వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో యోగా వేడుకలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా నిత్యం ఉదయం సమయంలో యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. యోగాతో వివిధ రకాలైన వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుందని, శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో 10వ అదనపు న్యాయమూర్తి శ్రీవిద్య ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రమేష్, అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక మల్లిమణుగుల వారి వీధిలో యోగా లైఫ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. సెంటర్ నిర్వాహకులు కరణం బాబురావు, రమాదేవి, విద్యార్థులు దేవిక, లక్ష్మి, మణి పాల్గొన్నారు.
- జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు సామూహిక యోగాసనాలు వేశారు. విద్యార్థులతోపాటు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొని, యోగాసనాలు వేశారు.
- రింగ్‌రోడ్డు రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బి.సుజాత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, విద్యార్థులు యోగాసనాలు వేశారు.
- మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు లంబా గౌరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హెచ్‌బీ శ్రీధర్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి టానిక్ వంటిదన్నారు. పతంజలి ప్రవేశ పెట్టిన యోగా భౌతిక వ్యాయామమని, మతానికి యోగాకి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, బాబు, వరప్రసాద్, ఆచార్యులు, నారాయణరావు, విజయలక్ష్మి, ఉమ, కరుణ జ్యోతి, దయాసాగర్, సుబ్రహ్మణ్యం, పట్టాభి, కామేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని స్కూళ్లతోపాటు పలు చోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట బాలికల హైస్కూలులో బాలికలతో పీడీ పెంటకోట కమల యోగా సాధన చేయించారు. యోగాసనాల ప్రాధాన్యం వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడి నుంచి బయటపడి ఆరోగ్యవంతంగా జీవనం సాగించడానికి నిత్య యోగా సాధన దివ్య ఔషధమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయుడు డి.కాళిదాసు, అప్పారావు, బీజేపీ ప్రతినిధులు కె.రాజారావు, శిష్టి అప్పారావు, ప్రగడ నూకరాజు పాల్గొన్నారు.

- కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, పీడీ వి.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- తాళ్లపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో బీజేపీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు పాల్గొని, మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ప్రపంచ వ్యాప్తంగా యోగా పట్ల ఆదరణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. యోగాసనాలు వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.


మల్లిమణుగులవారివీధిలోని యోగాలైఫ్ సెంటర్‌లో విద్యార్థుల యోగాసనాలు


జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.చిరంజీవి, మండలాధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పికొండ అప్పారావు, టీడీపీ నాయకుడు ఉగ్గిన రమణమూర్తి, జనసేన నాయకుడు కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- కన్నూరుపాలెంలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యాధికారి టి.శిరీష మాట్లాడుతూ ఆరోగ్యాన్ని అందించే యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా యోగాపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఆరోగ్య సిబ్బంది, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.
- మండలంలోని పరవాడపాలెం గ్రామంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించి ఉపాధి కూలీలకు యోగాపై అవగాహన కలిగించారు. సీఆర్‌పీ పందిరి సత్తిబాబు యోగా ప్రాధాన్యతను వివరించారు.


కశింకోట బాలికల హైస్కూల్లో ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు


కోర్టు ఆవరణలో యోగాసనాలు చేస్తున్న న్యాయమూర్తి రమేష్, న్యాయవాదులు


కన్నూరుపాలెం కల్యాణ మండపంలో యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు